ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 12 పుష్పం : 25-26 05-03-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

31-12-04
శృంగవృక్షం ............... 1
21-01-05
మల్కిపురం ................ 9

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 31-12-04, శృంగవృక్షం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మన తెలివితోగాని, మనస్సుతోగాని సంబంధం లేకుండా దేహం ద్వారా చాలా పనులు జరిగిపోతూ ఉంటాయి. మనం మంచి పనులు చేయటం మంచిదే, కాని అంతమాత్రంచేతనే జ్ఞానం రాదు. ఆత్మజ్ఞాన సముపార్జనకు మంచిపనులు సహకరిస్తాయి. మనం రోగం తగ్గటానికి ఏదైనా మందు వాడుతున్నాము అనుకోండి దానితో పాటు పత్యం ఉంటే ఆ రోగం తగ్గటానికి మందుతోపాటు, పత్యం కూడా సహకరిస్తూ ఉంటుంది. మనం జ్ఞానాన్వేషణలో ఉన్నప్పడు మంచిపనులు చేస్తూఉంటే అది పత్యం లాంటిది. మంచిపనులు మనకు సహకరిస్తూఉంటాయి. లోకంలో మనం చేసే మంచిపనులు హృదయం యొక్క లోతులు పెంచటానికి సహకరించాలి. మీ సంతానం వలన కాని, చదువు వలన కాని, గౌరవాల వలన కాని, మీకు ఉన్న అంగబలం వలన గాని, అర్థ బలం వలన గాని మీకు అమృతానుభవం కలుగదు అని వేదం చెప్పింది. భగవద్గీత మనం రోజూ చదువుతాము. అలా రోజూ చదివేసి మన పని పూర్తి అయింది అని అనుకోకూడదు, అది మనకు అర్థమవ్వాలి కదా. పొగతాగటం హానికరం అని సిగరెట్ పెట్టె మీద వ్రాసి ఉంటుంది. సిగరెట్ కాల్చేవాడు కూడా రోజూ అది చదువుతూ ఉంటాడు, కాని కాల్చటం మానడు. అంటే అర్థం ఏమిటి? అది వాడు చదువుతున్నాడు కాని ఆ మాట వాడికి అర్థమవ్వటం లేదు. సిగరెట్ కాల్చటం వలన వచ్చే హాని వాడికి అర్థమయితే వాడు కాల్చటం మానివేస్తాడు. వాడే కాదు మన పని కూడా అలాగే ఉంది. రోజూ గీత చదువుతాము, దానిలో ఈ పని నీకు తగదు దానికి దూరంగా ఉండు అని ఏదైతే చెప్పాడో

దానికి మనం దూరంగా ఉండలేక పోతున్నాము. అంటే అది మనకు అర్థంకావటం లేదు. రోజూ చదువుతున్నాము అంటే అది మనకు అర్థమవ్వాలి కదా. మనకు శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బాగుపడాలంటే మంచి స్నేహాలు చేయండి అని చెప్పారు. మనం చేసేది మంచి స్నేహాలు కావు అనుకోండి శరీరంలో, మనస్సులో అనారోగ్యం పెరిగిపోతుంది. ఇవి అన్నీ వారు ఏదో ఆలోచించి చెప్పిన మాటలు కాదు, దర్శించి చెప్పినవి. మన శరీరంలో అనారోగ్యం ఉంది అనుకోండి, మనస్సులో అశాంతి ఉంది అనుకోండి మనం వాడే మందులతో పాటు సజ్జనసాంగత్యం చేస్తూ ఉంటే ఆ రోగం నెమ్మదిగా తగ్గిపోతుంది. శరీరంలో అనారోగ్యానికి, సజ్జనసాంగత్యానికి సంబంధం ఏమిటి అని మీరు అడుగవచ్చు, చేసి చూడండి మీకే తెలుస్తుంది. అన్ని దానాలలోనికి నిదానం గొప్పది. కొంతమంది చాలా స్టడీగా ఉంటారు, వారి శరీరాలు దగ్గరగా లేకపోయినా రోజూ మనస్సులో ఒకసారి వారికి నమస్కారం పెట్టుకోవాలి. మనం స్థూలబుద్ధిని తగ్గించు కోవాలి, సూక్ష్మబుద్ధిని పెంచుకోవాలి, గుడి ప్రయోజనం, బడి ప్రయోజనం అదే. బడికి వెళ్ళి చదువుకొంటున్నాము. మన తెలివి తేటలు పెంచటానికి, బుద్ధి సూక్ష్మత కలగటానికే బడి. గుడికి వెళ్ళి పూజ చేయటం, జపం చేయటం కూడా బుద్ధిసూక్ష్మత కలగటానికి, మనస్సుకు ఏకాగ్రత కలగటానికి, మనస్సుకు లోచూపు కలగటానికి ఇవన్నీ చేస్తున్నాము. అందరూ హృదయేశ్వరుడిని ఆరాధించలేరు ఎందుచేతనంటే వాడికి రూపం ఉండదు, నామం ఉండదు. అలాగని లేడా అంటే ఉన్నాడు వాడిని చూడలేము కాబట్టి లేడు అనుకొంటున్నాము అదే ప్రమాదం. అందుచేత గుడి కట్టి అక్కడ విగ్రహాన్ని పెట్టి ఉపాసన చేయమని పెద్దలు చెప్పారు. గుడిలో మీరు చేయించి పెట్టే విగ్రహాలు కూడా అందంగా ఉండాలి. అందంగా ఉంటే వాటిని చూసేటప్పుడు మన నేత్రాలకు ఆనందం, మన మనస్సు అక్కడ నిలబడుతుంది, మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది. గుడిలో ఉన్న విగ్రహాలను ఆరాధించటం వలన, పూజ చేయటం వలన, జపం చేయటం వలన మనస్సే కాకుండా దేహం కూడా శుద్ధి అవుతుంది. మీ అత్తగారితో మీకు ఇష్టంలేకపోతే వేరే కాపురం పెట్టుకోండి. అంతేగాని అసలు నాకు అత్తేలేదు అంటే ఎలాగ? ఇప్పుడు మన పరిస్థితి అలాగే ఉంది. మనం భగవంతుడిలో నుండి వేరుపడిపోయాము. పోనీ వేరు పడిపోయి తిన్నగా ఉంటున్నా మా అంటే లేదు, అసలు భగవంతుడే లేడు అంటున్నాము. ఇలాగ తయారయ్యాము. మనం ప్రతీ విషయానికి అది అలా జరిగింది ఏమిటి? ఇది ఇలా జరిగింది ఏమిటి? అని అనుకుంటూ ఉంటాము, అది అలా ఎందుకు జరిగిందో భగవంతుడికి తెలుసు. ఆయననుండి వేరుపడి పోయాము కాబట్టి అది అలా ఎందుకు జరిగింది, ఇది ఇలా ఎందుకు జరిగింది అనుకొంటు న్నాము

కాని ఆయనతో మనకు వేరుపాటు కాపురం లేకపోతే ఇటువంటి తలంపులు మనకు రావు.

దేనినైతే మనం పొందాలి అనుకొంటున్నామో అది మనమై ఉన్నాము. అది గుర్తు పెట్టుకోవాలి. అది మనమై ఉన్నాము అన్న సంగతి మనకు అనుభవంలో లేకపోవటం వలన దేనినో పొందాలి అనుకొంటున్నాము. నిన్ను నువ్వు పొందటం ఏమిటి? మనం ఏదిగా ఉన్నామో అది మనకు తెలియటం లేదు. కాబట్టి మనకు ఇలా అనిపిస్తోంది. అది అనుభవం లోనికి వచ్చినప్పుడు అంతా మనకు తెలుస్తుంది. మనం పాత్రను శుభ్రంగా తోముకొని టేబుల్ మీద పెట్టుకొన్నాము అనుకోండి, అన్నం తినేసినట్లు కాదు. ప్లేటును శుభ్రంగా తోముకొన్నట్లు. సత్కర్మ నీ మనస్సును శుద్ధి చేస్తుంది, పవిత్రం చేస్తుంది. పవిత్రమైన మనస్సుకు ఆత్మవిద్య పడుతుంది కాని నువ్వు చేసే సత్కర్మ వలననే జ్ఞానం వచ్చేయదు. నీవు చేసే సత్కర్మ వలన మనస్సు నియమింపబడుతుంది. నియమింపబడిన మనస్సు జ్ఞాన సముపార్జనకు సమాయత్తం అవుతుంది. ప్రపంచంలోని ఏ సంఘటనలోనుండి మనం ప్లెజర్ తీసుకోకూడదు. మనం ఏదైనా మంచిపని చేసాము అనుకోండి. మీరు చాలా గొప్ప పని చేసారు అని ఎవరైనా అంటారు అనుకోండి దాని వలన మనం పొంగిపోయాము అనుకోండి ఇంక మీకు ఏదోరకమైన దుఃఖం వెయిటింగ్ లిస్టులో ఉందని అర్థం. ఇవాళ పొంగిపోయాము అనుకోండి, రేపు కుంగిపోవటం జరుగుతుంది. చనిపోయే వరకు ఇలా పొంగిపోవటం, కుంగిపోవటమే మన పని, ఇంతకన్నా మనకు ఏమీ లేదు. అసలు ఈ పొంగిపోయేది, కుంగిపోయేది ఎవరు? అహంకారమే. ఏదైతే పొంగిపోతోందో, ఏదైతే కుంగిపోతోందో అది నువ్వు కాదు. ఏదో పని చేస్తున్నావు, దాని వలన ఏదో వస్తుంది, దాని వలన పొంగిపోతున్నావు, కుంగిపోతున్నావు. దీనికి అసలు సత్యానికి ఏమీ సంబంధం లేదు. హృదయంలో ఉన్న వస్తువు సహజంగా ఉంది, మన జీవిత విధానం సహజంగా ఉంటే అది మనకు ఎరుకలోనికి వస్తుంది, అంతకంటే ఏమీ లేదు, దానికోసం మీరు ప్రత్యేకంగా కష్టపడి పోనక్కరలేదు, అది మనమై ఉన్నాము, కాబట్టి అది మనకు ఎరుకలోనికి వస్తుంది. అందుచేత మీరు సహజంగా జీవించండి. మన హృదయంలో ఉన్న సత్యం నీకు స్వరూపంగా వ్యక్తమయ్యే వరకు ప్రకృతి నిన్ను విడిచి పెట్టదు, ఇంద్రియాలు విడిచిపెట్టవు. లోకం నిన్ను విడిచిపెట్టదు. ఏ రోజు చేసుకొనే పని ఆరోజు, ఏరోజు చేసుకొనే సాధన ఆరోజు చేసుకోవాలి. వాయిదాలు వేస్తున్నాము అంటే సోమరితనానికి అలవాటు పడ్డాము అని అర్థం. హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఆ ప్రయత్నంలోనే మనకు ఎన్నో అందాలు కనిపిస్తూ ఉంటాయి, ఎన్నో శక్తులు వస్తాయి. ఇది కాదు, ఇది కాదు అని వాటిని గెంటుకొంటూ మనం ముందుకు వెళ్ళాలి. మధ్యలో ఆగిపోతే గమ్యాన్ని

చేరుకోలేము. నీవు మహిమల ఆకర్షణలో పడితే లోపలకు వెళ్ళలేవు. నీ మనస్సు ఎంత నిజమో మహిమలు కూడా అంతే నిజం. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని చేరుకొనే వరకు నీ ప్రయత్నం మానకూడదు, కాలు జారినా మరల తీసుకొంటూ అలా ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఈశ్వరస్మరణ విడిచి పెట్టకూడదు, మనో దేహములు శుద్ధి అయ్యేవరకు అలా స్మరించుకొంటూ ఉండాలి. భక్తులను కష్ట పెట్టకూడదు. భక్తులను కష్టపెడితే భగవంతుడు కూడా కష్టాలలో పడతాడట ఎందుచేత నంటే ఆయనకు భక్తులతో ఉన్న తాదాప్యం. నువ్వు నిజంకాని విషయాలను నిజం అని నమ్ముతున్నావు. నువ్వు నమ్మటం వలన అది నిజం అవ్వదు. నీకు తెలిసినా, తెలియకపోయినా లోపల ఒక నిజం ఉంది. నువ్వు ఏమి చెయ్యాలి అంటే అనవసరంగా కల్పించుకొన్న విషయాల నుండి, నువ్వు నిజం అని నమ్మిన విషయాల నుండి ప్రయత్నంచేసి బయటకురా, దేహాభిమా నాన్ని తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు తరించటానికి ఈ క్షణం నుండి ప్రయత్నం ప్రారంభించు, రేపు రేపు అనుకోవద్దు, వర్తమానకాలాన్ని సజీవంగా ఉపయోగించుకో. ఏదో కోరిక పెట్టుకొని, ఏదో ఆశించి పనిచేయటం తేలికే గాని ఏదీ ఆశించకుండా పనిచేయటం లోనే కష్టం అంతా ఉంది, ఇది మీరు అర్థం చేసుకోవాలి. అసలు ఏ రకమైన కోరిక లేకుండా, ఆశ లేకుండా మీరు పనిచేసి చూడండి, అప్పడు మీ మనస్సు కాలిపోతుంది, జ్ఞానోదయం అవుతుంది, మీరు కాలిపోతూ ఇతరులకు వెలుతురు ఇస్తారు. నేను ఆ గొప్ప పనులు చేసాను, ఈ గొప్ప పనులు చేసాను అంటూ కులాలు, మతాలు, గోత్రాలు తలపెట్టుకొంటూ శుభ్రంగా బలిసిపోయి ఉన్నారు, ఆ బలుపు తగ్గించుకోమంటున్నారు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నువ్వు కాని దానితో తాదాప్యం పొందకు. నీకు బాగా చదువు వచ్చింది అనుకో, నీ ప్రారబ్ధం తీసుకొని వచ్చింది. చదువే కాదు, ఐశ్వర్యమే కాదు, అధికారమే కాదు, సౌందర్యం కూడా దేహప్రారబ్ధాన్ని బట్టి వచ్చింది. ఆ ప్రారబ్ధాన్ని బట్టి వచ్చే వాటితో దేనితోనూ తాదాప్యం పొందవద్దు. ఆ తాదాప్యాన్ని మైనస్ చేసుకొంటూరారా. నువ్వు వెళ్ళి హృదయగుహలో పడిపోతావు.

మీరు సొంతబుద్ధిని ఎప్పుడూ విడిచిపెట్టవద్దు. సొంతబుద్ధి సుఖాన్ని తీసుకొని వస్తుంది, పరాయిబుద్ధి ప్రమాదంలో పడవేస్తుంది, దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. కాళ్ళు ఉన్నాయి నడుస్తున్నారు, చేతులు ఉన్నాయి పనిచేసుకొంటున్నారు అలాగే భగవంతుడు మీకు మెదడును కూడా ఇచ్చాడు, దానితో ఆలోచించండి అంతేగాని ఎత్తువారి చేతిబిడ్డల కింద ఉండవద్దు. లౌకికులతో సహవాసం చేయవద్దు అని గీతలో పరమాత్మ చెప్పాడు. కొంతమంది లౌక్యంగా మాట్లాడుతారు, చేతలు కూడా లౌక్యంగా ఉంటాయి. అటువంటి వారితో సహవాసం చేయటం వలన నీ జీవితంలో చివరకు దుఃఖం మిగులుతుంది. లౌకికులు చాలా ప్రమాదం,

వారు నిన్ను బాగుచెయ్యరు సరికదా నీకు ఉన్న భక్తిని ఊడగొడతారు, నిన్ను తలుపు సందున పెట్టి నొక్కినట్లు నొక్కి నలిపేస్తారు. మనం ఎవరితోనైనా స్నేహం చేస్తూ ఉంటే అది మనం బాగుపడటానికి, వారు బాగుపడటానికి కూడా సహకరించాలి. అంతేగాని వెనకాల గొయ్యిలు తీసుకొంటూ ఉంటే మీరు పాడవుతారు, వారూ పాడైపోతారు. మనకు ఎంతసేపు అది సాధించాము, ఇది సాధించాము అనే గొడవ తప్ప జ్ఞానం గొడవలేదు. తెగబలిసిపోయి ఉన్నాము. ముందు మీ తలకాయలో ఉన్న దుమ్మును దులుపుకోండి. ఏ వికారాలు అయితే మీ తలకు ఎక్కినాయో వాటిని వదిలించుకోండి. వీటివలననే లోపలవస్తువు ఉంది అన్న సంగతి కూడా మరిచిపోయారు, అసలు దాని గుర్తింపు కూడా లేకుండా పోయింది, ఇంక సాధన ఏమి చేస్తారు. గాఢనిద్ర మనకు గురువు. గాఢనిద్రలో మనకు దేహం గొడవలేదు, మనస్సు గొడవలేదు, లోకం లేదు, బంధువులు లేరు, దారిద్ర్యం లేదు, ఐశ్వర్యం లేదు, ఏ గొడవ లేదు. గాఢ నిద్రలో నువ్వు ఏదైతే కాదో అందులో నుండి విడిపోతున్నావు, నువ్వు ఏదిగా ఉన్నావో అదిగా ఉన్నావు, అక్కడ మెలకువ తెచ్చుకో. ఈ లోకానికి సంబంధించిన అనుబంధాలు, అనురాగాలు చర్మం ఎంత లోతుగా ఉంటుందో అనురాగాలు, ఆప్యాయతలు కూడా అంత లోతుగానే ఉంటాయి. చర్మం పెద్ద లోతుగా ఉండదు, సూదితో కొద్దిగా పొడిస్తే వెంటనే రక్తం వచ్చేస్తుంది, లోకంలో ఉన్న సంబంధాలు కూడా అంతే. మనం చీపురు పుల్లని త్యాగం చేస్తే ఇంక అస్తమానూ అదే తలపెట్టుకొంటూ ఉంటాము. బుద్ధుడు మహారాజు, ఆయన రాజ్యాన్ని మొత్తం అంతా కూడా త్యాగం చేసాడు. మీరు ఎంత త్యాగం చేసారు అని ఎవరైనా బుద్ధుడితో అంటే ఆయనకు ఏమీ అనిపించేది కాదు, నిర్వికారంగా ఉండేవాడు ఎందుచేతనంటే ఆయన త్యాగం చేసింది అంతా అసత్యం అని ఆయనకు అనుభవంలోనికి వచ్చేసింది. మీకు వందకోట్లు ఉన్నట్లు స్వప్నం వచ్చింది అనుకోండి, మెలకువరాగానే అది అసత్యం అని మీకు తెలుస్తుంది. నాకు వందకోట్లు ఉన్నాయి అని వికారం మీకు రాదు, అది అసత్యం అని తెలిసాక మీకు ఇంక వికారం రాదు. అదిసత్యం అనుకొన్నంతకాలం ఏదో రకమైన వికారం వస్తూనే ఉంటుంది. నువ్వు ఎంత కాలమయితే యోగివి కాలేవో అంతకాలం నీకు వికారాలు వస్తూనే ఉంటాయి. యోగి మాత్రమే నిర్వికారంగా ఉండగలడు, అర్జునా! నీవు యోగివి అవ్వటానికి ప్రయత్నం చెయ్యి అని పరమాత్మ చెప్పాడు. నువ్వు బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. ఈ శరీరం శవం అవ్వకముందే నువ్వు పొందవలసింది ఏదో పొందాలి. లేకపోతే నీకు మిగిలేది చీకటి లోకాలు. మనం గుడికి వెళ్లి దేవుడిని ఆరాధిస్తాము దేనికి అంటే ఆయన స్వరూపాన్ని మనం పొందాలి. జీవుడు దేవుడిని ఆరాధించవచ్చు, ఆరాధనా ఫలితం ఏమిటి అంటే దేవుడి

స్వరూపాన్ని జీవుడు పొందాలి. నీ ప్రారబ్ధంలో ఏది ఉంటే అది వస్తుంది. లాభం వస్తే పొంగిపోకు, నష్టం వస్తే కుంగిపోకు, వచ్చింది వచ్చినట్లే పోతుంది. కాలగర్భంలో నీ శరీరం పోతుంది, దాని ద్వారా పొందినవి పోతాయి. అందుచేత నీ ప్రారబ్ధంలో వచ్చిన దానితో కలిసిపోయి అవన్నీ నిజం అనుకొని మాయలో పడవద్దు. నీ ప్రారబ్దంలో ఎదురయ్యే సంఘటనలను తట్టుకోలేకపోతే ఇంక ఆత్మ ఎలా తెలుస్తుంది. నువ్వు ఎంతవరకు మనస్సును బాలెన్స్ చేసుకొంటే అంతవరకు ఆత్మచేత ప్రేమించ బడతావు, దాని దయ నీ మీద వర్షిస్తుంది. మనకు ఏదైనా అధికారం వచ్చింది అనుకోండి, అధికారం వలన మనకు గౌరవం రాకూడదు, మనవల్ల అధికారానికి గౌరవం రావాలి. మనకు డబ్బు వచ్చింది అనుకోండి. ఆ డబ్బు వలన మనకు గౌరవం రాకూడదు, మన చేతిలో ఉన్న డబ్బుకు మన వల్ల గౌరవం రావాలి. ఏదైతే నిత్యం కాదో, ఏదైతే సత్యం కాదో, ఏదైతే మనకు శాంతిని ప్రసాదించదో దానిని నిజంగా సంపాదించావు అనుకో దాని వలన నీవు పొందేది ఏపాటిది? ఎక్కడికక్కడ నరుక్కొంటూ పోతున్నాడు.

వంద సున్నలను కూడినా నీకు సున్నే వస్తుంది, కాని ఒకటి రాదు. అలాగే నీవు ఏదిగా ఉన్నావో దానిని పొందకుండా మిగిలినవి ఎన్ని పొందినా అది అంతా కూడా ఒకటి లేని సున్నలతో సమానము. నువ్వు గ్రహించవలసింది ఏమిటి అంటే ఆనందం, శాంతి నీలోనే ఉంది బయట ఎక్కడా లేదు కాని అది నీకు అర్థమవ్వటం లేదు. శాంతికోసం బజారులో వెతుక్కొంటున్నావు. మనం ఎక్కడ పాడైపోతున్నాము అంటే వారిలో ఈ లోపం ఉంది, వీరిలో ఆ లోపం ఉంది అని ఎదుటి వారిలో ఉన్న లోపాలు వెతుకుతూ ఉంటాము. వారిలో లోపాలు ఉంటే నీకు వచ్చే నష్టం ఏమిటి? వారే నష్టపోతారు. ఎదుటి వారిలో ఉన్న లోపాలు చూసే బదులు నీలో ఉన్న లోపాలు చూసుకొని, వాటిని బయటకుతీసి కాల్చి బూడిదచేస్తే నీవు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి వస్తుంది. కాని ఇతరుల లోపాలు వెదకటం వలన నీకు ఏమీ లాభం లేదు, దాని వలన టైము పాడవుతుంది, శక్తి వృథా అవుతుంది. చివరకు తలపోటు మిగులుతుంది. గురువు మనలోపల అంతర్యామిగా ఉండి పనిచేస్తూ ఉంటాడు. ఒకోసారి మీకు లోపల కోపం ఉంటుంది, ఆ కోపం ఉన్నట్లు మీకు తెలియదు, గురువు దానిని ఆపరేట్ చేస్తూ ఉంటాడు. హరీంద్రనాథ్ చటోపాధ్యాయ భగవాన్‌తో అంటారు నీవు నన్ను ప్రేమిస్తున్నావు, ప్రేమిస్తున్నట్లు కనబడవు. బాగా ప్రేమిస్తున్నావు కదా అని నీ దగ్గరకు వస్తే మొఖం ప్రక్కకు పెట్టుకొని గోడవంక చూస్తున్నావు అన్నాడు. అంటే చటోపాధ్యాయకు కోపం వస్తుంది కదా, అంత కోపం ఉంది అని వాడికి తెలిస్తేనే

కాని అది బయటకు పోదు, అది కూడా ఆయన ప్రేమలో ఒక భాగమే అని గ్రహించినవాడు ధన్యుడు. మనస్సు పలచబడేటట్లు చూసుకోవాలి. మనస్సు పలచబడే కొలది లోపలఉన్న వస్తువు మీకు తెలుస్తూ ఉంటుంది. వాడు నిన్ను చూస్తూ ఉంటాడు, నువ్వు ఆయనను చూసుకోవచ్చు, అద్భుతమైన ఎంజాయ్‌మెంట్. మనస్సు చిక్కగా ఉంటే, దుప్పటిలా అడ్డుగా ఉంటే ఇంక ఏమి చూసుకొంటారు, చూసుకొన్నా కనబడరు. లోపలఉన్న దుమ్ము తగ్గే కొలది మనస్సు పలచ బడుతుంది, అలా మనస్సు పలచబడి, పలచబడి ఏదో రోజున దానంతట అదే చిరిగిపోతుంది. అదే సాధన యొక్క గమ్యం. సాధన అంటే నీవు ఏదో పొందటం కాదు, ఈశ్వరానుభవం పొందటానికి ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తెంచుకొంటూ రావటమే. మేము అది సాధించాము, మేము గొప్పవారము అని ఇలా పూర్వజన్మల నుండి ఏవైతే మీ తలకు ఎక్కి ఉన్నాయో ముందు వాటిని తగ్గించుకొంటూ రావాలి. జ్ఞానం మీ లోపలే ఉంది, దానిని మీరు ఏమీ సంపాదించనక్కరలేదు. మీ తలకు ఎక్కిన గొడవలు అన్నీ వదులుకొంటే లోపల ఉన్న వస్తువు మీకు ఎరుకలోనికి వస్తుంది. నువ్వు కాని దేహంతోటి, నువ్వు కాని మనస్సుతోటి, నువ్వు కాని పరిసరాలతోటి, నువ్వుకాని లోకంతోటి తాదాప్యం తగ్గించుకో. ఇలా నువ్వు కాని వాటితో ఎప్పుడయితే తాదాప్యం తగ్గించుకొంటూ వస్తున్నావో అప్పుడు నీవు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి వస్తుంది, అది నీ కడసారి జన్మ. ఎవరైనా మిమ్మల్ని స్తోత్రం చేయవచ్చు అప్పుడు మీకు సంతోషం అనే వికారం రాకూడదు. ఇతరులు ఎవరైనా మిమ్మల్ని నిందించవచ్చు అప్పుడు మీకు దుఃఖం అనే వికారం రాకూడదు. ఇవి రెండూ వస్తూ ఉంటే మీ పతనం ప్రారంభమౌతుంది. స్తుతి వలన సంతోషం, నింద వలన దుఃఖం వస్తూ ఉంటే అనాత్మ బుద్ధి పెరుగుతుంది. అనాత్మబుద్ధి మీకు దుఃఖాన్ని తీసుకొనిరావటమే కాదు పునర్జన్మలను కూడా తీసికొని వస్తుంది. మీకు ఎప్పుడైనా టెన్షన్‌గా ఉంది అనుకోండి, సత్పురుషుల దగ్గరకు వెళ్ళి కూర్చోండి, మీకు టెన్షన్ తగ్గిపోతుంది ఎందుచేతనంటే వారి వైబ్రేషన్స్ మీమీద పనిచేస్తాయి. మనం సాధన చేస్తూ ఉంటే మనం ఏదైనా చదువుతూ ఉంటే అది ఎంతవరకు మనలో ఉన్న మాలిన్యాన్ని తొలగిస్తోంది, మనకు ఏమైనా వెలుగు గోచరిస్తోందా అని లోపల చూసుకొంటూ ఉండాలి. లోకం అంటే ఏమీ లేదు నామం, రూపం, క్రియ అంతకంటే ఏమీ లేదు. నామం, రూపం, క్రియ మైనస్ చేస్తే ప్రపంచం లేదు. తప్పడు తాదాప్యం కూడా అంత తొందరగా పోదు, అది పోవాలంటే రైట్ యాక్షన్, రైట్ స్పీచ్, రైట్ తింకింగ్ ఇవి అన్నీ ఉండాలి. ఒక పని నీవు మంచిది అనుకొన్నప్పడు చేసేయి, లోకం గొడవ నీకు అనవసరం, ఫలితం కోసం కూడా ఎదురుచూడవద్దు. ఫలితం ఎప్పడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది ఈశ్వరుడు చూసుకొంటాడు. ఉ

దయం పుణ్యం చేయటం సాయంత్రానికి ఫలితం వచ్చేయాలి అంటున్నారు ఏమిటో అర్థం కావటం లేదు. రావిచెట్టు చుట్టూ తిరుగుతారు ఇంకా ప్రదక్షిణ పూర్తి అవ్వదు, స్వర్గలోకానికి వెళ్ళిపోవాలి అనుకొంటున్నారు. ఇలా ఉంది మన పరిస్థితి. మనం చేసిన పనికి ఫలితాన్ని ఈశ్వరుడు ఆయన దగ్గర ఉంచుకోడు, ఆయనకు అవసరం లేదు. ఆయన పూర్ణ కాముడు. అన్ని కోరికలు నెరవేరినవాడు ఆయన, ఆయనకు కోరికలు అంటూ ఏమీ ఉండవు. మీరు చేసిన కర్మకు ఫలితం ఇచ్చేస్తాడు. ఆయనకు ఏమీ అక్కరలేదు, దీని వలన ఆయన పొందేది ఏమీ లేదు. నదులు అన్నీ వెళ్ళి సముద్రంలో కలవటం వలన సముద్రానికి వచ్చే లాభం లేదు, నదులు అన్నీ కోపగించి సముద్రంలో కలవం అంటాయి అనుకోండి అప్పుడు సముద్రానికి వచ్చే నష్టం లేదు, ఒక్క అంగుళం కూడా కిందకు వెళ్ళదు. అదీ సముద్రం అంటే అట్టివాడు భగవంతుడు. మనం పైకి మర్యాదస్తులు లాగ కనిపిస్తున్నాము, లోపల శుభ్రంగా పాడైపోయి ఉన్నాము, బలిసిపోయి ఉన్నాము. ఈ పాడుబుద్ధిని తొలగించుకో. నువ్వు కాని దానిని నేను అనుకొంటున్నావు. అది నీకు తలకెక్కిపోయింది, ఇవాళ తొందరగా పొమ్మంటే అది పోదు. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం ఇవి మూడూ లేకుండా నీ తలకెక్కినది తొందరగా పోదు. దేవుడు వచ్చి మీకు మోక్షం ఇస్తాను అంటే మీ ఇష్టం, మీకు ఎప్పుడు ఇవ్వాలని ఉంటే అప్పుడు ఇవ్వండి అని అనాలి కాని ఇప్పుడే ఇచ్చేయండి అని అడగకూడదు. కొంతమంది మీటింగులు అడగటానికి మా దగ్గరకు వస్తారు. ఎంత మర్యాదగా మాట్లాడతారు అంటే ఏమండి నాన్నగారు మీకు ఎప్పుడు అవకాశం ఉంటే అప్పుడు పెట్టండి. మీ అనుకూలం చూసుకోండి అంటారు. అక్కడ డిమాండ్ ఉండదు. కొంతమంది అలాకాదు మీరు ఒకటవ తేదీనే పెట్టాలి అంటారు. భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా ఒక భక్తుడు అంటాడు నాకు జ్ఞానానికి, మోక్షానికి తొందర ఏమీ లేదు, ఏదో పొందాలి అని నాకు వేగిరపాటు లేదు. నిన్ను ఒకటే కోరుకొంటున్నాను రాబోయేజన్మలోనే కాదు నా ప్రారబ్ధంలో ఇంకా వెయ్యిజన్మలు ఉన్నా కూడా అన్ని జన్మలలోను నీవే నాకు గురువుగా ఉండాలి అన్నాడు. గురువు మీద ప్రేమ కుదిరింది అనుకోండి చూసుకోవటంలోనే ఆనందం వచ్చేస్తుంది. ఆ ఎంజాయ్‌మెంట్ భరించలేము ఇంక వస్తువును పొందినప్పుడు ఇంక ఎంత ఆనందంగా ఉంటుందో. మోక్షం ఎప్పుడు వస్తుంది, వస్తే ఎలా ఉంటుంది ఇటువంటి దండగ ప్రశ్నలు వద్దు. అనవసరంగా నీవు మనస్సును పెంచుకొంటున్నావు, ఇలా మనస్సును పెంచుకోవద్దు. నేను బంధింపబడ్డాను అని నీవు అనుకొంటున్నావు కాబట్టి నాకు విడుదల ఎప్పుడు వస్తుంది అనుకొంటున్నావు. ఇవన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు, అసలు సత్యానికి వీటితో ఏమీ సంబంధం లేదు. నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని నీ నెత్తిమీద మోయకు.

